ఊరువూరుకుంది

తేళ్ళపల్లి వెంకట లక్ష్మీనారాయణ శర్మ

బస్సు వేగంగా పోతోంది. నేను రెండు ప్రక్కలా చూస్తున్నాను. చుట్టుప్రక్కల వున్న ఆకుపచ్చని జనపచేలమంచి వచ్చే చల్లనిగాలి ఆహ్లాదకరంగావుంది. ఆకుపచ్చగా వున్న చేలల్లో అక్కడక్కడా పత్తుగా వున్న పసుపు రంగు జనపవూలు ఆచేలకింకా ఎక్కువ అందాన్నిస్తున్నాయి.... యింతవరకూ నెమ్మదిగా వీస్తున్న గాలి కొంచెం తీవ్రంగా రావటం మొదలెట్టింది. మరింత చల్లగాకూడా వుంది. తలబయటకు పెట్టి ఆకాశంవంక చూశాను. నాలుగ్గైదు నల్లని మబ్బులు దగ్గరకు చేరుకుంటున్నాయి. యింతవరకూ యీ వాతావరణాన్ని చూస్తూ ఎంతో సంతోషిస్తున్ననాకు 'వానకురిసేటట్లుంది' అన్నఆలోచన రాగానే కొంచెం కంగారు పుట్టింది. కారణం నేనా ప్రాంతానికి పూర్తిగా క్రొత్తవాణ్ణి కావటమే. మామూలు సమయంలోనే పల్లెటూళ్ళలో ఒకవూరి నుంచి యింకో వూరికి దారులు కనుక్కుంటూ పోవటం కష్టం. అలాంటిది వాన కురుస్తున్నప్పుడు తెలిసిన వాళ్ళెవ్వరూ లేని యీ ప్రాంతంలో ఒక్కణ్ణీ వుండటం కొంచెం కష్టం.అదీగాక మా శాస్త్రి వూరు నేను బస్సుదిగే వూరి నుంచి రెండు మైళ్ళ దూరంలోవుంది. అక్కడికి వెళ్ళేందుకు రోడ్డుకూడా లేదు, చేలగట్లవెంట వెళ్ళాలిట. కాలవగట్టు వెంట వెళ్ళొచ్చుటగానీ అలావెడితేనాలుగు మైళ్ళదూరంట. అందుకే యీ బస్సు ఆగే వూరు తనేవస్తానన్నాడు శాస్త్రి. వర్షం పడేటట్లయితే శాస్త్రి వస్తాడో, రాడో అనే అనుమానం కూడా నాకుంది. శాస్త్రికి 'ఎడ్వంచరస్'గా వుండటం అంటే గొప్ప సరదా.వాడి వుద్దేశ్యం ప్రకారం అలాంటి పన్లు చేసినతర్వాత వచ్చే సంతృప్తి చాల ఎక్కువట. నాకా సంతృప్తి నివ్వాలనే వుద్దేశ్యంతో వుద్దేశ్యపూర్వకంగానే రావటం మానుకున్నా ఆశ్చర్య పడనక్కర్లేదు.

మెల్లగా చినుకులు పడటం ప్రారంభించినయ్. దూరంగా మెరుపులు కూడా మెరుస్తున్నాయ్. బండరాళ్ళు దొర్లిపడుతున్నట్లు ఉరుములు కూడా మొదలయినయ్. ఉరుము వురిమినప్పుడల్లా నా ముందు సీట్లో కూర్చున్న ఒక పడివయస్సు రైతు 'అర్జునా! ఫల్గుణా' అంటున్నాడు..... వాన కొంచెం పెద్దదవ్వంగానే వెనక సీట్లో కూర్చున్న కండక్టరు టవల్తీసి నెత్తిమీదుగా కప్పుకుంటూ 'సుబ్బారావ్! కొంచెం స్పీడెట్టు........ యీవాన తొరెక్కువయ్యేతలికి కూసిపూడి చేరుకోవాలి" అని అరుచుకుంటూ డ్రైవరు వేపు వెళ్ళేడు. అలా వెడుతూ 'మీరు దిగాల్సింది ముందొచ్చే వూరేనండి' అన్నాడునావంకచూసి. నేను ఎదటి సీటు క్రింద పెట్టిన సూట్కేసు పైకి తీశాను. యీ కండక్టర్తో నేను బెజవాడలో బస్సు ఎక్కినప్పుడే నేను దిగాల్సిన వూరు వచ్చినప్పుడు నాతో చెప్పమని చెప్పాను. సూట్కేసు నా ప్రక్కగా వున్నసీటుమీద పెట్టుకుని టైము చూసుకున్నాను ఐదున్నరయ్యింది. అయినా మబ్బులు దట్టంగా పట్టటంతో చీకటి పడినట్లుంది. యిలాంటి సమయంలో ఎవ్వరూ తెలియని యీ క్రొత్తవూళ్ళో దిగటం నాకంతగా నచ్చలేదు. అందుకే కండక్టరు దగ్గరకెళ్ళి—

'ఈ బస్సు రాత్రికి ఎక్కడ ఆగుతుంది?'అని అడిగాను.

'కూసిపూడండి' అన్నాడు.

'కూచిపూడిలో హోటళ్ళూ, అవీ వుంటయ్యా?' అన్నాను. హోటళ్ళు వుంటే అంతవరకూ టికెట్టు తీసికొని రాత్రికి అక్కడవుండి మర్నాడు ప్రొద్దున వెనక్కు తిరిగొచ్చి మా శాస్త్రి వూరు వెళ్ళొచ్చుని నా వుద్దేశ్యం. యీ వర్షంలో శాస్త్రి రాకపోతే యిక్కడ వుండటం చాలా కష్టం. కండక్టరు నవ్వుతూ—

'అంటే లాడ్జింగులా ! I..... అటువం వుండవండి'అన్నాడు. యింతలోకే కారు ఒక వూరు మొదట్లో ఆగింది. చుట్టూ చీకటిగా వుంది.

'యిదేసార్! మీరు దిగాల్సిన చోటు' అన్నాడు కండక్టరు.

నేను సీట్లోంచి లేచిలేబడి ప్రక్కనున్న చావిడీలోంచి చుట్టూచూశాను. చీకటిగావుంది. 'గీజ్ గీజ'మంటూ కీచురాళ్ళ చప్పుడు వినిపిస్తోంది. ఏం చెయ్యాలో తోచక సూట్కేసుని మాత్రం యాంత్రికంగా చేతిలోకి తీసుకున్నాను. మళ్ళీ ప్రక్కనున్న చుప్పట్లోంచి చూశాను. అంతా చీకటిగా వుంది. కారులోవున్న దీపాలకాంతి బయట అయిదారడుగుల వరకూ ప్రసరిస్తోంది. ఆపైన వున్న వస్తువులన్నీ పిలిపిడల్లా కనుపిస్తున్నయ్... యింతలో ప్రక్కనున్న చెట్టుక్రిందనుంచి మా బస్సు వైపుకి గొడుగువేసుకుని ఒకవ్యక్తి రావటం కనుపించింది. నా కెందుకో ఆ వచ్చేది శాస్త్రిఅనే అనిపించింది. బహుశః అది నాలోవున్న ఆశవల్లనే కావచ్చు. ఆ వచ్చింది శాస్త్రే.

'మూర్తీ! దిగరా' అన్న కేకవిని వుత్సాహంతో సూట్‌కేసు తీసుకుని బస్సులోంచి దిగాను. రొద చేసుకుంటూ బస్సు వెళ్లిపోయింది.

'బ్రతికించావ్!..... నువ్వొస్తావో రావోనని కొంచెం కంగారుపడ్డాను' అంటూ మా శాస్త్రి చెయ్యి పడిచి వాడి గొడుగు క్రిందకు వెళ్లాను.

'మధ్యాహ్నం మూడింటి కొచ్చాను...... పదే..... వర్షం కాస్త తగ్గేవరకూ ఆ గుడిమంటపం మీద కూర్చుందాం పద' అంటూ కొంచెం దూరంలోవున్న గుడివైపు దారి తీశాడు.

గుడి దగ్గరకు చేరుకున్నాం. అదొక పాడుపడిన గుడి. ధ్వజస్తంభం దగ్గర గడ్డి, పిచ్చి మొక్కలు మొలిచినయ్.... మబ్బులు పూర్తిగా విడిపోలేదు. అందుకని చీకటిగానే వుంది. అయినా గుడి స్వరూపం మాత్రం కన్పిస్తోంది. ముందుగా వున్నమండపం పైకి వెడుతూ ప్రక్కకి చూశాను. గుడి తలుపులు విరిగిపోయినయ్. కీచురాళ్లు శబ్దాలు చేస్తున్నాయ్. పక్షులేవో గూళ్లల్లో రెక్కలు విదిలించుకుంటున్నయ్—గడ్లగూబలు కాబోలు......ఆ మండపం మీద నాలుగైదు బండరాళ్లున్నాయ్. గొడుగు మడిచి ప్రక్కనపెట్టి అందులో ఒక బండరాయి మీద కూర్చున్నాడు శాస్త్రి. నేను కూడా సూట్‌కేస్ క్రింద పెట్టి ఒకరాయిమీద కూర్చున్నాను. జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించాడు శాస్త్రి. నాక్కూడా ఒకటిచ్చాడు. అగ్గిపెట్టె అందుకుంటూ అనుమానంగా అడిగాను:

'వరేయ్! యిది గుడికదా?...... పైగా కల్యాణ మండపంలో కూర్చుని సిగరెట్లు కాల్చొచ్చా?'

'నేనేదో నాస్తికుణ్నయ్యి యిలాంటి పన్లు గుళ్లోనే చేస్తున్నాననుకోకు. యీ గుళ్లో దేవుడు లేడు. యీ వూరివాళ్లంతా చేరి ఆదేవుణ్ణి గుళ్లోంచి తరిమివేశారు. సరిగ్గా యిరవయ్యేళ్లకో, యిరవైఅయిదేళ్లకో పూర్వం యీ గుళ్లోంచి దేవుడు వెళ్లిపోయాడు.' అన్నాడు శాస్త్రి పొగవదలుతూ.

'అదేవిటి?! ఏదో కథ చెవుదామనుకున్నావా!' అన్నాను నవ్వుతూ.

'కథ కాదు రామూర్తీ! అప్పటికి నాకు చిన్నతనం అయినా యీ విషయం మా నాన్నగారికి బాగా తెల్సు. యీచుట్టు ప్రక్కల ఆయన వయస్సు వాళ్లందరికీ తెల్సు' అన్నాడు శాస్త్రి.

'ఏవిటది?' అన్నాను కుతూహలంగా.

శాస్త్రి చెప్పటం మొదలు పెట్టాడు.

* * *

అదా వూరి పేరు రాముపురం. యీచుట్టు ప్రక్కల వున్న వూళ్లన్నిటిలోనూ యిదే చిన్న వూరు. మొత్తం పాతిక యిళ్లు కూడాలేవు. యిరవయ్యేళ్లక్రితం ఎన్ని యిళ్లున్నాయో యిప్పుడు కూడా అన్ని యిళ్లేవున్నాయి. యీ యిరవయేళ్లల్లోనూ వూళ్లో ఏం మార్పులేదు. గుళ్లోంచి దేవుడు వెళ్లిపోతూ యీ వూరికిచ్చిన శాపం అది అని యీ ప్రాంతంవాళ్ల నమ్మకం

వూరు చిన్నదయినా వూరికి గుడి ముఖ్యం అనే వుద్దేశ్యంతో లక్ష్మీదేవి గారనే ఒకావిడ యీ రామాలయం కట్టించింది. ఆవిడ గొప్ప భక్తురాలు. బాల్యం

ఊరు వూరుకుంది

లోనే భర్తను పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు. భర్త చనిపోయిన దగ్గర్నుంచి దైవచింతనతోనే కాలంవెళ్లబుచ్చేది. ఆవిడ సంపన్న కుటుంబంనుంచి వచ్చిన వ్యక్తిగాదు. యీ చుట్టు ప్రక్కల వూళ్లన్నీ తిరిగి చందాలు ప్రోగుచేసి యీ రామాలయాన్ని కట్టించింది. చందాలతోనే యీ దేవాలయానికి రెండెకరాల పొలం ఏర్పాటు చేసింది. గుడికి దగ్గర్లోనే ఒక చిన్న 'మఠం' కట్టించింది. దేవుడికి నిత్యనైవేద్యాది విషయాలు చూసే పూజారి ఆ మఠంలో వుంటూ యీపొలంమీదవచ్చే ఆదాయంతో జీవించేందుకు వీలుగా యివన్నీ ఆవిడ ఏర్పాటు చేసింది. దేవాలయాన్ని యీ స్థితికి తీసుకురావటానికి ఆవిడ ఎన్నో ఏళ్లు పాటుపడింది. కానీ ఏనాడూ తను యీ గుడికి 'ధర్మకర్త'ననే అహంకారం ఆమెకుండేదికాదు.

'యీ దేవాలయం యీ వూళ్లోని, యీ ప్రక్క వూళ్లల్లోని ప్రజల దైవభక్తికి నిదర్శనం. యిదంతా వాళ్ల సహాయం వల్లనే జరిగింది. నేను నిమిత్తమాత్రురాల్ని' అనే నిరాడంబరురాలు ఆవిడ. తనుకూడా ఆ మఠంలోనే ఒక చిన్నగదిలో వుంటూ దేవుడికి పూజలూ, నైవేద్యాలూ తనే స్వయంగా దగ్గరవుండి చేయిస్తూ వుండేది. గుడి కట్టించిన మరుసటి సంవత్సరమే కృష్ణమాచార్యులు 'యీ వూరి అర్చకుడుగా వచ్చాడు.

కృష్ణమాచారికి ముప్పయ్యేళ్లలోపు వయస్సుంటుంది. మనిషి చాలా అమాయకుడు. కొంచెం నల్లగా వుంటాడు. నుదుటికి పైన రెండు మూడంగుళాలవరకు అర్ధవృత్తాకారంలో నున్నగా క్షవరం చేయబడి, గుండా? క్రాపింగా? అన్న సందేహాన్ని కలుగజేస్తూ వుండేది అతనితల. వెనుకనుంచి చూస్తే క్రాపింగు తలగాను, ముందునుంచి చూస్తే గుండుగానూ కనిపిస్తూ వుండేది. కనుబొమలమధ్యనుంచి తలమీద వున్న నున్నటి ప్రదేశం చివరిదాకా మూడు పొడవైన నిలువు బొట్లు పెట్టుకునేవాడు. రెండు తెల్లబొట్లమధ్య ఎర్రటి బొట్టువుండేది. యీ నిలువు బొట్లతో కృష్ణమాచారి మొహంలో నిండుతనం వుట్టిపడుతూవుండేది. అమాయకమైన అతని ముఖం, ఆ ముఖంలో ఎల్లప్పుడూ కన్పించే నిష్కల్మషమైన నవ్వు ఎవ్వరినైనా యిట్టే ఆకర్షించేవి. 'అచారి చాలా అమాయకుడు. చాల యోగ్యుడు'అనే వాళ్లు వూళ్లోని పెద్దలు. 'అచారి చాలా మంచివాడు' అనేవాళ్లందరూ. వూళ్లోవాళ్లందరికీ తలలో నాల్కలా వుండేవాడు. కృష్ణమాచారి భార్యపేరు గాయత్రి. గాయత్రికి యిరవయ్యేళ్ల వయస్సుండేది. బంగారురంగు చాయ. ఎవరినైనా వకటికి రెండుసార్లు ఆమెవంక చూసేట్లు చేసే అందం ఆమెది. గాయత్రి సుగుణాల రాశి. సదాచారాలపట్ల అమితమైన గౌరవం ఆమెకు. దైవభక్తి చాల ఎక్కువ. మడి, ఆచారాల్తో వ్యవహరిస్తూ భర్తే సర్వస్వంగా భావిస్తూ వుండే సాధ్వి గాయత్రి.

కృష్ణమాచారి ప్రొద్దున ఏడుగంటలకే స్నానం చేసి గుళ్లోకి వెళ్లి పూజ మొదలు పెట్టేవాడు. యీవూళ్లో యిద్దరు ముగ్గురు సంపన్నుల గృహాల్లో తప్ప మిగతా యిళ్లల్లో బావులు లేవు. అందరూ యీ గుళ్లోవున్న బావినుంచే మంచి నీళ్లు తీసుకువెళ్లేవారు. ఉదయం ఏడు గంటలకే యీ గుడికి వచ్చి స్నానం చేసి, దోవతి, ఉత్తరీయం ప్రక్కనున్న పచ్చగన్నేరు చెట్టుమీద ఆరవేసి 'ధావళి'కట్టుకుని పూజకుపక్రమించేవాడు కృష్ణమాచారి. తెల్లగన్నేరు పూలు, పచ్చగన్నేరు పూలు, శంఖుపూలు కోసి విగ్రహాన్ని వివిధ రీతుల్లో అలంకరిస్తూ వుండేవాడు. ఆ విధంగా అలంకరించి ఎంతో సంతృప్తితో విగ్రహం వంక చూస్తూ మంత్రాలు చదివేవాడు. పది గంటలదాకా పూజ చేసి పదింటికి 'అవసరనైవేద్యం' పెట్టి, గుడి తలుపులు దగ్గరగా వేసి, తనొచ్చి గుడిమంటపంమీద కూర్చుని విస్తళ్లు కుట్టుకుంటూ ఏవో కీర్తనలు పాడుకుంటూ వుండేవాడు.

యింట్లో పనంతా ముగించుకొని ఓందె చంకన పెట్టుకుని పదింటికిగాయత్రి గుడికొచ్చేది. గుడి దగ్గరే స్నానం చేసి నీళ్లు తీసుకుని తడిబట్టలతో 'మఠం' చేరుకునేది. పన్నెండు గంటలయ్యేసరికి వంట పని పూర్తి చేసి 'మఠం' బయటకొచ్చి, బయటవున్న చింతచెట్టుక్రింద నిలబడేది. 'మహానైవేద్యం' సిద్ధంగా వున్నదన్న దానికది గుర్తు. మండపం మీద కూర్చున్న కృష్ణమాచారి ఆమెను చూసి గుడికి తాళం వేసి మహానైవేద్యం తీసుకువచ్చేందుకు మఠానికి వెళ్లేవాడు. తళతళలాడే యిత్తడిపళ్లెంలో పదార్థాలన్నీ వడ్డించిన విస్తరి వుంచి, దానిమీద యింకొక విస్తరి వేసి, పళ్లెం చుట్టూ తడిగుడ్డ చుట్టి సిద్ధంగా వుంచేది గాయత్రి. కృష్ణమాచారి పళ్లెం ఒక చేతోపుచ్చుకుని, రెండవ చేతో నీళ్లగ్లాసు పుచ్చుకుని గుడికి బయల్దేరేవాడు. యింటికి తాళంవేసి, గుడితాళం చెవిపుచ్చుకుని గాయత్రి భర్తవెనకాల గుడికి వెళ్లేది. కృష్ణమాచారి మహానైవేద్యం చేసేటప్పుడు గాయత్రి, అయిదారునిముషాలవరకూ గుడిగంట మోగిస్తూ వుండేది. యీ గుడిగంట విన్న తర్వాతకాని వూళ్లోవున్న పెద్దలు భోజనాలు చేసేవారుకాదు. మహానైవేద్యం అవుతోందని తెలియజేయటానికే ఆగంట కొట్టటం జరిగేది. ఆ గంట మ్రోత యీ వూరంతటికీ వినిపించేది. మహానైవేద్యం అయిన తర్వాత యిద్దరూ తిరిగి మఠానికి వెళ్లిపోయేవారు.

సాయంత్రం ఆరు గంటలకు మళ్లీ గుడి తలుపులు తెరచి దీపారాధనచేసి గుడిమండపం మీద పిల్లలందర్నీ చేర్చి భజన కీర్తనలు చెప్పిస్తూ వుండేవాడు కృష్ణమాచారి. పిల్లలందర్నీ రెండు వరసల్లో ఎదురెదురుగా కూర్చోబెట్టి తను మధ్యలో తిరుగుతూ కీర్తనలు చెప్పి, అవివాళ్లచేత అనిపిస్తూ వుండేవాడు. యీలా ఒకగంటసేపు భజనలు చేయించి, వాళ్లందరికీ కొబ్బరి ముక్కలు పంచిపెట్టి యిళ్లకు పంపించేవాడు. యిదీ కృష్ణమాచారి నిత్యకృత్యం.

అవి ధనుర్మాసం రోజులు. వూళ్లోవున్న కుటుం

జాలన్నీ రోజుకొక్క విధంగా దేవుడికి 'భోగాలు' చేయిస్తున్నారు. ఒకరోజు పులిహోర, యింకొక రోజు చక్రపొంగలి...... యిలా వివిధ పదార్థాలు దేవుడికి ప్రొద్దున్నే చేయిస్తూ వుండేవారు. పిల్లలందరూ ప్రొద్దున్నే గొబ్బిళ్ళు పెట్టుకుని గుళ్ళో గంట వినబడంగానే ప్రసాదం కోసం గుడివైపుకు పరుగులెత్తేవాళ్లు.

ఆరోజు ప్రసాదం పెట్టే కృష్ణమాచారి మండపం మీదకు చేరి కీర్తనలు పాడుకుంటున్నాడు. అటువేపునుంచి వెడుతున్న సుబ్బావధాని—

'ఏం ఆచారిగారూ! ఏవిటి ఖబుర్లు?' అంటూ తను కూడా మంటపంమీదకొచ్చాడు.

సుబ్బావధానికి ముప్ఫయ్యేళ్ల వయస్సుంది. వూళ్లోకంతకూ సంపన్నుడైన కృష్ణశాస్త్రి గారి కుమారుడు సుబ్బావధాని. కృష్ణశాస్త్రిగారు అన్ని వేదాలు చదివారు. వారి తండ్రిగారైన సుబ్బావధాని గారు గొప్ప పండితుడు. వారిపేరే కుమారుడికి పెట్టారు కృష్ణశాస్త్రిగారు. కాని సుబ్బావధానిలో తాతగారి గుణాల్లో ఏవక్క గుణంలేదు. 'అగ్రహారీకపు' కుటుంబంలో పుట్టి బాధ్యతా రహితంగా పెరిగిన కుర్రవాళ్లలో వుండే లక్షణాలన్నీ వున్నాయ్ సుబ్బావధానికి. కాలానుగుణ్యంగా యింగ్లీషు చదువులు చెప్పిద్దామని కృష్ణశాస్త్రిగారు బందరులో ప్రత్యేకంగా ఒక యిల్లు తీసుకుని తన మేనత్త అయిన సోమిదేవమ్మగార్ని అక్కడుంచి సుబ్బావధానిని హైస్కూలులో చేర్పించారు. సుబ్బావధానికి చదువు మాత్రం అలవడలేదు. గానీ, పట్టణవాసంతో అనేక చెడు అలవాట్లు పట్టుబడ్డయ్. స్కూలు ఫైనలు రెండు మూడుసార్లు తప్పి సుబ్బావధాని తిరిగి రామవరం చేరుకున్నాడు. ఆ సంవత్సరమే అతనికి పెళ్లయ్యింది. అతనికిద్దరు పిల్లలు. తాత లార్జించిన ఆస్తితోపాటు, వాళ్లు సంపాదించిన కుటుంబ గౌరవం కూడా ఖర్చుపెడుతూ తిరిగే వ్యక్తి సుబ్బావధాని.

సుబ్బావధానికి మంచి 'పర్సనాలిటీ' వుంది. దానికితోడు కృత్రిమ సౌందర్య సాధనాల్తో మెరిసి పోతూ వుంటాడు. అతనెప్పుడూ కట్టేవి మల్లెపూవుల్లాంటి బట్టలే. తన అందంతో ఏ ఆడదానినైనా యిట్టే వశం చేసుకోవచ్చనే వుద్దేశ్యం సుబ్బావధానిలో బలంగా వుంది. పట్టణంలో అలాంటి అనుభవాలు అతనికి చాలా వున్నయి. యీ పల్లెటూళ్లో కూడ అలాంటి అనుభవాలు దొరక వచ్చునే 'ధీమా' అతనికుంది. అలాకొన్ని అనుభూవాలతనికున్నయ్ కూడాను. గాయత్రి యీ వూరు కొచ్చిన క్రొత్తలోనే ఆమెమీద ఒకకన్నుంచాడు. ఆమె అందం అతనిలోని కోరిక బలాన్నింపచ్చింది. అతని అందం, హోదా అతనిలో ఆశల్ని రేపినయ్. కృష్ణమాచారి ఆకారం ఆ ఆశలకు బలిష్ఠమైన రెక్కల్ని కట్టింది. 'యిలాంటి చిన్నది యీ వెధవతో కాపురం చెయ్యటం ఏమిటి?' అనుకునే వాడు సుబ్బావధాని. అంతటితో ఆగలేదు. గాయత్రికూడా ఎప్పుడూ కాకపోయినా కొన్ని సమయాల్లోనైనా తప్పకుండా అట్లా అనుకోవచ్చని అతని వూహ. అతని సిద్ధాంతంకూడా అదే. ముఖ్యంగా తనని చూసినప్పుడట్లా అనుకుని తీరుతుందని అతని నమ్మకం. అలా అనుకునే ఆడదాన్ని వశపర్చుకోవటం క్షణాల్లో పని అని కూడా అతని నమ్మకం. అలాంటి అవకాశం కోసం నిరీక్షిస్తున్నాడు సుబ్బావధాని. ప్రతిరోజు గాయత్రి స్నానం చేసే వేళ్టికి గుడి దగ్గరకు వచ్చి కృష్ణమాచారితో కబుర్లు చెప్తుతూ కూర్చునేవాడు. మండపం మీద కూర్చుని బావి దగ్గర స్నానం చేస్తున్న గాయత్రినే చూస్తూ వుండేవాడు. ఒంటికి అతుక్కుపోయిన తడి చీరలోంచి కనిపించే గాయత్రి అవయవ సౌష్ఠవం సుబ్బావధానిని పిచ్చివాణ్ణి చేసేది. కానీ సుబ్బావధానిలోని యీ వికారం గాయత్రికిగానీ, కృష్ణమాచారికిగానీ తెలియదు. యిద్దరూ అమాయకులే. మనుష్యుల మంచితనంలో నమ్మకంవున్న మంచి మనుష్యులువాళ్లు. అందువల్లే సుబ్బావధాని రోజూ ఆవేళ్టి కొచ్చి కూర్చోవటం వాళ్లల్లో అనుమానం కల్గించలేదు.

సుబ్బావధానిని మండపం మీదకు సాదరంగా ఆహ్వానించాడు కృష్ణమాచారి. 'రండి, అవధానిగారూ!' అంటూ. సుబ్బావధానికి 'అవధాని' అని పిలిపించుకోవటం సిగ్గు. అట్లా ఎవరైనా పిలిస్తే తనని అవమానించినట్టు భావించేవాడు. నాగరికత పేరుతో అంతగా పతనమైన వాడు సుబ్బావధాని అతని స్నేహితులందరూ అతని 'సుబ్బారావ్' అని పిలుస్తారు. అలా పిలవమని అతనే చెప్పాడు వాళ్లకి. కృష్ణమాచారికి కూడా 'సుబ్బారావు'అని పిలవమని చాలాసార్లు చెప్పాడు. కాని కృష్ణమాచారి అప్పుడప్పుడూ 'అవధానిగారూ!' అనే పిల్చేవాడు, అతనికి అలాపిలవటంతోనే ఎక్కువ గౌరవం యిస్తున్నట్లని పించేది.

సుబ్బావధాని మండపంమీద కూర్చుంటూ 'ఏవిటి ఆచార్లూ!..... నన్ను సుబ్బారావని పిలవమని చెప్పాలా?........ ఏం పేర్లివి?..... 'ఆచారి', 'అవధాని'...... అన్నాడు.

కృష్ణమాచారి నవ్వుతూ 'కూర్చోండి' అన్నాడు తను గోడ ప్రక్కకి జరుగుతూ. సుబ్బావధాని కూర్చుని బావివేపు చూశాడు. గాయత్రి ముఖానికి పసుపు రాసుకుని, పైటకిందనుంచి మంగళసూత్రం పైకి తీసి దానికి పసుపురాసి కళ్లకద్దుకుని బొక్కెనతో నీళ్ల తలమీద పోసుకుంది. గిలకమీదనుంచి త్రాడు లాగుతున్నప్పుడు ఆమెవంకే రెప్పవాల్చకుండా చూస్తున్నాడు సుబ్బావధాని......

'నీపేరు కూడా మార్చుకోరాదు?!' 'కృష్ణమాచారి' ఏవిటి? అందమైన పేరన్నా పెట్టుకో!! (నువ్వెలాగూ అందంగాలేవు!)....'కృష్ణమూర్తి' అని పేరుపెట్టుకో' అని గాయత్రికి వినబడేటట్లు బిగ్గరగా అన్నాడు సుబ్బావధాని. అనినవ్వాడు. కృష్ణమాచారి కూడా నవ్వాడు. గాయత్రికూడా యీ మాటలువిని యిటువైపు తిరిగి నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో సందేశాలు వినిపించినట్లు సుబ్బావధానికి. కామెర్లవాడికి లోకంఅంతా పచ్చగానే కన్పిస్తుంది. కళ్లకు 'కామం' పొరకప్పిన వాడికి లోకం అంతా 'కామం'తో నిండినట్లు కనిపిస్తుంది. సుబ్బావధాని పరిస్థితి కూడా అట్లాగే వుంది...... కాస్సేపాగి కృష్ణమాచారి అన్నాడు:

''మా ఆవిడ పేరు మార్చుకోమంటే మార్చుకోవాల్సిందే....... ఏం గాయత్రీ! నేను కూడా పేరు మార్చుకోనా ఏవిటి!?''

గాయత్రి స్నానం చెయ్యటం పూర్తి చేసి ఓందె నడుముపై పెట్టుకుని 'వద్దు లేద్దరూ' అని యింటికి బయల్దేరింది. వెడుతున్న గాయత్రిని ఉద్దేసించి సుబ్బావధాని—

'ఏవండోయ్! రేప్పొద్దున దేవుడికి భోగం ఏవిటి?' అన్నాడు.

'పులిహోరాండి' అంది గాయత్రి.

'అయితే రేప్పొద్దున్నే నే నిక్కడ వాల్తాను. నాకు పులిహోర చాలా యిష్టం....నాకు కొంచెం ఎక్కువగా ప్రసాదం పెట్టమని ఆచార్యులగారితో చెప్పండి' అన్నాడు సుబ్బావధాని తడి గుడ్డల్తో



తెలిపిన గాయత్రి వంక చూస్తూ, గాయత్రి నవ్వింది. మామూలుగానే నవ్వింది. గాయత్రి నవ్విన ఒక్కొక్క నవ్వుకీ కొన్ని వేల అర్థాలు కల్పించుకుంటూ సుబ్బావధాని మనస్సు ఉత్సాహంతో పొంగిపోతోంది.

'మా ఆవిడ పులిహోర శ్రేష్ఠంగా చేస్తుం దండి.....రేపు రండి మీకే తెలుస్తుంది' అన్నాడు కృష్ణమాచారి నవ్వుతూ. నవ్వుతూ కృష్ణమాచారి వంక చూసి వెళ్ళిపోయింది గాయత్రి.

'ఆ......చూశారా! నేను పేరు మార్చుకోవటం మా ఆవిడ కిష్టంలేదు' అని గలగలా నవ్వాడు కృష్ణమాచారి. నవ్వాలిగదా మరి అన్నట్టు నవ్వాడు సుబ్బావధాని. నీలాంటి వాడికి పేరు మార్చినంత మాత్రాన వచ్చే లాభం ఏమిటని నీ పెళ్ళాం ఉద్దేశ్యంరా, వైధవాయ్! అని నవ్వుకుంటూ మనస్సులో అనుకున్నాడు సుబ్బావధాని.

కాస్సేపు ఏవో కబుర్లు చెప్పుకున్న తర్వాత కృష్ణమాచారి—

'ఆ......మీ యింటికి దక్షిణంవేపు ప్రహరీ గోడ కట్టిస్తున్నారట్లేవుంది కదూ?' అన్నాడు.

'ఆ!.....' అన్నాడు సుబ్బావధాని.

'మన్లో పనిగా యీ గుడి సంగతి కొంచెంచేయించి పెట్టాలేమిటి?....గర్భ గుళ్ళో సరిగ్గా విగ్రహం పైన కొంచెం పగిలింది. పైనుంచి రాళ్ళు ఏ క్షణంలో విరిగి మీద పడతాయోనని భయంగావుంది. పైగా ఆ పగుళ్ళళ్ళోంచి పాముకట [illegible] పడుతుం టోంది.

.....ఎంత? రెండు మూడు గంటల పని..... లక్ష్మీదేవిగారికి ఒంట్లో బాగాలేదు. లేకపోతే ఆవిడే యీ పని చేసేవారు.

'అలాగే.....చూద్దాం. తాపీమేస్త్రీ ఖాళీగా వున్నప్పుడు పంపిస్తాను' అని లేచి దూరంగా వెడుతున్న రాముగొడ్డని 'గడ్డీ!' అంటూ చప్పట్లు కొట్టి పిలిచి 'యింటికి పోతాను' అంటూ వెళ్ళిపోయాడు సుబ్బావధాని.

సుబ్బావధానికి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. గదిలో అన్ని వైపులా గాయత్రే కనిపించింది. ఒక నిశ్చయానికొచ్చి రాత్రి రెండు గంటలకు నిద్రపోయాడు.

కోళ్ళు కవ్వించుకుంటున్నట్టు కూస్తున్నాయ్. చలి ఎక్కువగా వేస్తోంది. కోమటి సుబ్బయ్య లేచి చలిమంట వెయ్యటం మొదలెట్టాడు. గొబ్బిళ్ళకు ఆవుపేడ తెచ్చేందుకు పిల్లలు చిన్న చిన్న డబ్బాలు పుచ్చుకుని బయల్దేరి కాస్సేపు సుబ్బయ్య చలిమంట దగ్గరకూర్చుని వెడుతున్నారు.... గాయత్రి నిద్రనుంచి లేచింది. ధనుర్మాసంలో. రెండుసార్లు నైవేద్యానికి వంట చెయ్యాలి. మొదటి వంట సూర్యోదయంనుండే చెయ్యాలి. అప్పుడు పులిహోరగానీ, చక్రపొంగలిగానీ, చిట్టిగారెలుగానీ లేదా ఆరోజు 'భోగం' చేయించే వాళ్ళు చెప్పిన యింకే పదార్థమైనా చేస్తుంది. తర్వాత మధ్యాహ్నం మహానైవేద్యానికి మామూలుగా వంట చేస్తుంది. అందుకే తెల్లవార జామునే లేస్తుంది.

యిళ్ళల్లో మరుగుదొడ్లు లేవు. అందుకని

ఊరు వూరుకుంది

స్త్రీలకు ప్రత్యేకంగా వూరిచివరనున్న 'బీడు'ను మరుగుదొడ్డిగా కేటాయించారు.

'తలుపు దగ్గరకు వేసెడుతున్నాను..... చూస్తూ వుండండి' అని కృష్ణమాచారితో చెప్పి బయటకు నడిచిందిగాయత్రి.

సుబ్బయ్య సెట్టి చలిమంటవేస్తూ ఏదో పాడు కుంటున్నాడు. పిల్లలందరూ చలిమంట చుట్టూతా కూర్చున్నారు. తర్వాత వచ్చినవాళ్ళకు కూర్చునేందుకు చోటుచాలక నిలబడి కూర్చున్న వాళ్ళతలలు మీదుగా, పైకొచ్చే మంటలమీద, చేతులుంచు తున్నారు. యిదిచూసిన సుబ్బయ్యసెట్టి మంట కొంచెం ఎక్కువ చేస్తూ దగ్గరగా కూర్చున్నవాళ్ళని దూరంగా జరిగేటట్టు చేసి అందరూ కూర్చునేం దుకు చోటు చూపిస్తున్నాడు..... అక్కడక్కడ కాకులు 'కావ్, కావ్' మంటున్నాయ్... గాయత్రి పరుగెత్తుతోందా అన్నట్టు వూరిబయట నుంచి వస్తోంది. అంత చలిలోకూడా ముఖమంతా చెమ టలు పట్టినయ్. ముఖమంతా భయం ఆవరించింది. కళ్ళల్లో నీళ్ళు నిండినయ్. పెదవులు దుఃఖం తోనూ, కోపంతోనూ కంపిస్తున్నయ్. ముడిగా వేసుకున్న జడవూడిపోయింది..... 'మఠం దగ్గరకు చేరుకున్న తర్వాతగానీ గాయత్రి నడకవేగం తగ్గించ లేదు. కాళ్ళు కడుక్కోకుండానే యింట్లోకి వెళ్ళి తలుపు గడియవేసి కళ్ళుమూసుకుని ఒక్కక్షణం తలుపు కానుకుని నిలబడింది. తలుపుచప్పుడు విని కృష్ణమాచారి మంచం మీదనుంచిలేచి, తలుపు కానుకుని బెదరిన లేడిమాదిరున్న భార్యనుచూసి 'ఏమిటి, గాయత్రీ!' అంటూ దగ్గర కెళ్ళాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ దగ్గరకొస్తున్న భర్తను తప్పించుకుని లోపలి గదిలోవున్న లక్ష్మీదేవిగారి దగ్గర కెళ్ళింది గాయత్రి. 'ఏం జరిగింది, గాయత్రీ!' అంటూ కంగారుగా ఆమె వెంటలోపలికి వెళ్ళాడు కృష్ణమాచారి......

అంతావిన్న లక్ష్మీదేవిగారు 'ఛీ, దుర్మార్గుడు' అంది ఆవేశంగా. జబ్బుమనిషి అయినా మంచం మీదనుంచి లేచి గాయత్రిని దగ్గరకు తీసు కుంది. ఆవిడఒడిలో తలపెట్టుకుని భోరున ఏడ్చింది గాయత్రి. కృష్ణమాచారి ప్రళయకాలరుద్రు డయ్యాడు. 'వాడి రక్తం కళ్ళచూస్తాను' అన్నాడు ఆవేశంగా పిడికిలిబిగిస్తూ, గాయత్రి భయంగా భర్తవంక చూసింది..... లక్ష్మీదేవిగారు కాస్సేపాలో చించి—

'ఆవేశపడకబ్బాయ్.... యిదంతా నలుగురికీ తెలియ జెయ్యటం ఎందుకు? నేనేవెళ్ళి వాళ్ళమ్మ చేత వాడికి బుద్ధి చెప్పిస్తాను..... నువ్వు తొందర పడకు' అంది...... కొంతసేపైన తర్వాత కృష్ణ మాచారి శాంతించాడు.

యిద్దరూ లక్ష్మీదేవిగారి గదిలోంచి బయట కొచ్చారు. బయటకు వచ్చి భర్తను గట్టిగా కౌగ లించుకుని వణికే కంఠంతో 'మనల్ని భగవంతుడు చల్లగా చూశాడు' అంది గాయత్రి. ఆమె కళ్ళ నీళ్ళు తుడుస్తూ ఆమెను మరింత దగ్గరగా తీసు కున్నాడు కృష్ణమాచారి.

* * *

సుబ్బావధాని దెబ్బతిన్న పులి మాదిరున్నాడు. తను కోరింది తనకు దక్కలేదు. చేతికందిందనుకున్న గాయత్రి అందకుండా పారిపోయింది. చెయ్యికొరికి తప్పించుకుని పారిపోయింది. అందని వస్తువు మీద అయిష్టం ఏర్పడుతుంది. అది పిరికివాళ్ళ లక్షణం. సుబ్బావధాని పిరికివాడుకాదు. వూరిలో కెల్లా ఆస్తి పరుడు. తలచుకుంటే ఏమైనా చెయ్యగలడు. గాయత్రి తనకు చిక్కకుండా పోయిననాటి మధ్యా హ్నం యింకా ఏ వుపాయంతో ఆమెను లోబర్చు కోవాలో ఆలోచిస్తూ గాయత్రి కొరికిన తన చేతి వంక చూసుకుంటున్నాడు. గాయత్రి యింటికివెళ్ళి సంగతంతా చెప్పితే ఏం ముప్పువస్తుందో అన్న భయం భయమే రాలేదు సుబ్బావధానికి. కారణం— ఆచారి హీనుడు. వూళ్ళో సామాన్యంగా జీవించే ఒక ఒక అర్చకుడు. అతనికి తనను ఏమైనా చెయ్యగల స్తోమతలేదు.... డబ్బు మనిషికి అంతులేనిధైర్యాన్ని అధికారాన్ని యిస్తుంది. డబ్బుమనిషికి నీతి, నియమాలతో పనిలేదు. అతడి విషయంలో వాటికి నిర్వచనాలు వేరు..... గాయత్రిని అనుభవించలేక పోయానని విచారిస్తున్న సుబ్బావధానికి వీధి వాకిలి లోంచి వస్తున్న కృష్ణమాచారి, లక్ష్మీదేవి గారు కనుపించారు. సుబ్బావధాని కొంచెం కంగారు పడ్డాడు. అయినా అది కనిపించకుండా సిగరెట్టు వెలిగించాడు....లక్ష్మీదేవిగారు ఒక్క క్షణం ఆగి సుబ్బావధానివేపు అసహ్యంగా చూసి లోపలికి వెళ్ళింది. కృష్ణమాచారి కోపంగా సుబ్బావ ధాని వంక చూస్తూ లోపలి కెళ్ళాడు. కృష్ణమాచారి చూపు సుబ్బావధానిలో అహంభావాన్ని రెచ్చ గొట్టింది. 'యీ క్షుద్రుడికి తన వంక అట్లా చూడ గలిగే ధైర్యమా?' అని పళ్ళు నూరాడు సుబ్బావధాని....లోపలి గదిలో సుబ్బావధాని తల్లి నరసమ్మగారుంది..... కొంత సేపటికి గదిలోంచి 'సుబ్బయ్యా!...యిటురా' అన్న నరసమ్మగారి గర్జన వినిపించి పిల్లిలా లోపలికి వెళ్ళాడు సుబ్బావ ధాని. సుబ్బావధానికి తల్లి అంటె కొంచెం భయం. యిప్పటికీ బయట ఎన్ని వేషాలు వేసినా యింట్లో జాగ్రత్తగానే ఉంటాడు. అదీగాక కొంత ఆస్తి నరసమ్మగారిపేర వుంది.....

నరసమ్మగారు కోపావేశంతో సుబ్బావధానిని నోటికొచ్చిన తిట్లల్లా తిట్టింది. 'వంశ ప్రతిష్ఠ నాశనం చేశావ్ గదరా..... యింకెందుకీ బ్రతుకు? ఛీ, నీ ముఖం చూస్తేనే పాపం.....చండాలుడా' అని ఆయాసంతో గోడ కానుకుని కూర్చుంది.పోయింది. సుబ్బావధాని తల వంచుకుని నిలబడ్డాడు. 'యీ ఆచారి వెధవ ఎదుట యిట్లా నిలబడటమా?' అని మనస్సులోనే బుసలు కొట్టాడు....చివరికి నరసమ్మగారు కృష్ణమాచారి చేతులు పట్టుకుని—

'నాయనా! యివి చేతులుకావు. నీకూ, నీభార్యకూ జరిగిన అవమానానికి క్షమించమని అడిగే అర్హత ఎవ్వరికీలేదు.....కానీ నిన్ను చూసి యీ చండాలుణ్ణి క్షమించు.....మా వంశ ప్రతిష్ఠని కాపాడు' అంటూ

వేసుకుంది.

పేదవాడి మాన మర్యాదలకంటే ధనవంతుడి పరువు ప్రతిష్ఠలు ఎక్కువ. పేదవాడి మాన మర్యాదలు శాశ్వతంగా నాశనం అయినా ధనవం తుడి పేరు ప్రతిష్ఠలు మాత్రం చెక్కు చెదర కూడదు. యిదీ న్యాయం! ..... యిదేం న్యాయం! ? .... యిదే న్యాయం!? ..... కానీ నరసమ్మగారు ఆ ఉద్దేశ్యంతో అడగలేదు. ఆవిడ పశ్చాత్తాపంతో కుమిలిపోతోంది. చేతులు పట్టు కున్న నరసమ్మగారికి నమస్కరిస్తూ—

'అమ్మా! అంత మాటనకండి. మీరు నాకు తల్లి వంటివారు. మీ పరువు ప్రతిష్ఠల్ని కళంకితం చెయ్యాలనే ఉద్దేశ్యంతో నే నిక్కడకు రాలేదు. అది నా ఉద్దేశ్యం కూడా కాదు. నేను పరువుగా బ్రతకాలన్నదే నా లక్ష్యం' అని సుబ్బావధాని వంక చూశాడు కృష్ణమాచారి.

'మీ ముఖం చూసి విడిచిపెడుతున్నాను. కపోతే యీ నిమిష్ణే బజారుకి యీడ్చించి పెద్ద మను ష్యుల్తో చెప్పు దెబ్బలు కొట్టించేవాణ్ణి. ఆవే శంతో వూగిపోతూ అన్నాడు కృష్ణమాచారి. సుబ్బావ ధాని పిడికిళ్లు బిగిస్తూ కృష్ణమాచారి వంక చూశాడు. కానీ, తల్లి ఎదట ఏమీ మాట్లాడలేక గది బయటకు విసురుగా వచ్చేశాడు. 'యీ నాటికి యీ ఆచారి వెధవ నన్ను చెప్పు దెబ్బలు కొట్టిస్తా నంటాడా?...వరేయ్, ఆ చారీ! నీ అంతుచూస్తాను.' అంటూ యింట్లోంచి బయటకు వెళ్లిపోయాడు సుబ్బావధాని.....గాయత్రి నోటకు రక్కలేదు. పైగా ఒక అనామకుడిముందు అపరాధిలా నిలబడవలసి రావటం—యీ రెండూ సుబ్బావధానిలో ప్రతీ కార వాంఛను రేకెత్తించినయ్.

* *

మధ్యాహ్న సమయం— రెండు గంటలయ్యింది. మంచం చింతచెట్టు క్రింద వేసుకొని చిన్న కత్తితో కొబ్బరి ముక్కలు తరుగు తున్నాడు కృష్ణమా చారి. సాయంత్రం గుడికొచ్చే పిల్లలకు పంచి పెట్టే ప్రసాదం అది..... సుబ్బరామయ్యగారి పాలేరు వీరన్న వచ్చి 'దండాలండి, ఆచార్లుగోరూ' అంటూ క్రింద కూల్చున్నాడు.

'ఏమిటి వీరన్నా?' అన్నాడు కృష్ణమాచారి ముక్కలు తరగటం ఆపి.

మా చిన్నయ్యగారికి కొడుకు పుట్టారండి..... యిప్పుడే కృష్ణాపురం నుంచి కవురొచ్చింది... అన్నాడు వీరన్న.

'ఆహా ..... సుబ్బరామయ్యగారికి మనవడన్న మాట..... బాగుంది' అన్నాడు సంతోషంతో కృష్ణమాచారి. వీరన్న లేచి 'పాల వెడుతున్నానండి..... పురుడొచ్చింది కదా.... అందుకని రేపు దేవుడికి...' అంటూ ఆగాడు వీరన్న.

'హోహో....అదా.... నేనింకో యింట్లో ఏర్పాటు చేస్తానని సుబ్బరామయ్యగారికి చెప్పు' అని వీర న్నను పంపించి వేశాడు కృష్ణమాచారి.

ఆ మర్నాడు 'భోగం' చేయించాల్సింది. సుబ్బ రామయ్యగారు. కానీ పురుడు రావటం వల్ల వారు చేయించ కూడదు. యిలాంటి అడ్డంకులు ఏవన్నా వచ్చినప్పుడు గానీ, 'భోగం' చేయించటానికి ఎవ్వరూ ముందుకు రాకపోయినప్పుడు గానీ కృష్ణశాస్త్రి గారి యింటి వాళ్లు ఆ రోజు 'భోగం' చేయించ టం అలవాటు. తాము చేయించే రోజుల్లోనే గాక యిలాంటి రోజుల్లో కూడా కృష్ణశాస్త్రి గారింటి వాళ్లే చేయిస్తూ వుండేవారు. అది కృష్ణశాస్త్రి గారు బ్రతికి వున్న రోజుల్నించీ వస్తున్న ఆచారం. సుబ్బరామయ్యగారు పురుడు విషయం చెప్పి రమ్మనటంతో యీ విషయం చెప్పటానికి కృష్ణమాచారి కృష్ణశాస్త్రి గారింటికి బయల్దేరాడు.

'నేను నరసమ్మ గారింటికి వెళ్లొస్తాను' అని గాయత్రితో చెప్పి బయల్దేరాడు. గాయ త్రికి కుడికన్ను అదిరింది. మనస్సులో ఏదో శంక బయల్దేరింది.

'మీరే వెడ్తారా?.... సూరమ్మను పంపి చెప్పిస్తే సరిపోతుందేమో' అంది గాయత్రి.

'అబ్బే, అదేం బాగుంటుంది. నరసమ్మగారే మన్నా అనుకుంటుంది. అదీగాక ఎవరి పేర చేయించ మంటారో కనుక్కోవాలి.... వాళ్ల గోత్రం కూడా సరిగ్గా గుర్తు లేదు నాకు' అంటూ బయలుదేరి వెళ్లాడు కృష్ణమాచారి. భయాందోళనల్తో భర్త వెళ్లిన వైపే చూస్తూ నిలబడింది గాయత్రి.

కృష్ణశాస్త్రి గారిది పెద్ద మండువా యిల్లు. మధ్య వసారాలో సుబ్బావధాని, రామిరెడ్డి సిగరెట్లు కాల్చుకుంటూ పేకాట ఆడుతున్నారు. వీళ్లని దాటి వెడితే గానీ నరసమ్మ గారి గది రాదు. కృష్ణమా చారి వీళ్ల ప్రక్కనుంచి నడచి లోపలి గదిలోకి వెళ్లాడు. కృష్ణమాచారి వెళ్లిన వైపు చూసి కనుబొమలు ముడిచాడు సుబ్బావధాని. గట్టిగా పొగ పీల్చి ఒక్క క్షణం ఆలోచించి చేతిలో పేక ముక్కలు తీసి బల్లమీద పారేసి రామిరెడ్డిని తీసుకుని తన పడక గదిలోకి వెళ్లాడు.

కొంతసేపైన తర్వాత ఒక పెద్ద పళ్లెం నిండా కావాల్సిన పదార్థాలన్నీ తీసుకుని కృష్ణమా చారి నరసమ్మగారి గది గుమ్మం దాటాడు. అతడు గది గుమ్మం దాటుతుండగా నరసమ్మగారు మళ్లీ—

'నాయనా! కృష్ణుడా!.... సాయంత్రం నేను నెయ్యి పంపిస్తాను. సున్నూ రా నక్కర్లేదులే మళ్లీ.. చిట్టి గారెలు నేతితో చేయించు' అంది.

'అలాగే నండి...... యీ పళ్లెం రేపు ప్రొద్దున్నే ప్రసాదంతో పాటు తెచ్చి నేనే యిస్తాను.... వస్తా నండి' అంటూ బయట కొచ్చాడు. రెండు చేతుల్లో పళ్లెం పట్టుకుని మధ్య వసారాలోంచి వెళ్తుండగా ప్రక్క గదిలోంచి సుబ్బావధాని పరు గెత్తుకుంటూ వచ్చి కృష్ణమాచారి బనీనుకున్న జేబులో రూపాయల కట్ట క్రుక్కాడు. వెంటనే 'పట్టుకో రెడ్డీ! దొంగముండా కొడుకుని' అంటూ అరిచాడు. యిద్దరూ కలసి కృష్ణమాచారిని చేతులు వెనక్కి విరచి పట్టుకున్నారు. అతని చేతిలో పళ్లెం క్రింద పడి దాంట్లోవన్నీ చెల్లా చెదురుగా పడి పోయినయి. సుబ్బావధాని తన కాలి చెప్పుతీసి కృష్ణమాచారి తలమీద 'టప, టప' బాదటం మొదలు పెట్టాడు.

'బాబోయి, చంపేస్తున్నారు' అంటూ అరిచి శక్తి కొద్దీ వాళ్లిద్దరి విదిలించుకుని బజార్లోకి పరుగెత్తాడు కృష్ణమాచారి. వీధి గుమ్మం దాటుతుం డగా ధోవతి కాలికి అడ్డం పడి ముందుకు పడి పోయాడు. క్రింద పడ్డ కృష్ణమాచారిని కాలితో తన్ను సాగారు రెడ్డి, సుబ్బావధాని. కృష్ణమా చారి వెన్నుముక 'కలుక్కు' మంది. 'అమ్మా', అంటూ బాధతో అరిచాడు. రచ్చబండ మీద కూర్చున్న అయిదారుగురు పరుగెత్తుకొచ్చి రెడ్డిని



సుబ్బావధానిని అవతలకు లాగారు. సుబ్బావధాని వాళ్లని విదిలించుకుని,

'వదలండయ్యా.... లం—కొడుకు, ఓబిలు మీదున డబ్బెత్తుకొస్తున్నాడు., దొంగ లం....' అన్నాడు. కృష్ణమాచారి మెల్లగా కూర్చున్నాడు. నిలబడలేక పోయాడు. 'అబద్ధం' అంటూ చెప్ప బోతూండగా సుబ్బావధాని పలుగుర్నీ విదిలించు కుని కృష్ణమాచారి జేబులోంచి నోట్ల కట్ట తీసి—

'చూశారా..... గాడిద కొడుకుని కొట్టాలా? చంపి పాతెయ్యాలా?' అంటూ చెప్పుతీసి మళ్లీ బాదటం మొదలెట్టాడు. కృష్ణమాచారి ముఖం మీద చేతులు అడ్డం పెట్టుకుంటుంటే చేతులు లాగి మరీ కొట్టసాగాడు సుబ్బావధాని. రెడ్డి వెనక నుంచి కృష్ణమాచారిని ఒక్క తన్ను తన్నాడు. కృష్ణమాచారి నేల మీద పడిపోయాడు. పడి పోయిన వాణ్ణి రాళ్ల మీద యీడ్చారు. కృష్ణమా చారి జేబులో నోట్ల కట్ట చూసిన తర్వాత యింటాక వచ్చి అడ్డపడ్డ వాళ్లు యిప్పుడేమీ మాట్లాడటం లేదు. కృష్ణమాచారి జేబులోని డబ్బు అతనిపై ఆపాదింపబడిన నేరానికి ప్రత్యక్ష సాక్ష్యంగా యిప్పుడందరికీ కనిపిస్తోంది...... చుట్టూ యిరవై మందిదాకా చేరారు. అందులో పెద్దలున్నారు., పెద్ద మనుష్యులున్నారు., సామాన్య మైన మనుష్యులున్నారు. కానీ ఎవ్వరూ ఏమీ మాట్లాడటం లేదు. యీ పెద్ద మనుష్యుల నిజాయతీ పట్ల నమ్మకంతో ఒకప్పుడు వాళ్ల చేత సుబ్బావధానిని చెప్పుతో కొట్టిస్తానన్నాడు కృష్ణమాచారి. కానీ ఆ పెద్ద మనుష్యుల మధ్యే సుబ్బావధాని కృష్ణమాచారినే చెప్పుతో కొడుతు న్నాడు. పెద్ద మనుష్యులు 'పెద్ద' మనుష్యులకే సహాయం చేస్తారని కృష్ణమాచారికి తెలియదు. అతడు 'చిన్న' మనిషి., అమాయకుడు....

సుబ్బావధాని చేతి కొచ్చినట్లు కొడుతునే

ఊరు వూరుకుంది

వున్నాడు. కృష్ణమాచారి కన్నుపైన గీరుకుపోయి రక్తం కారింది. పెదివి చిట్లి నెత్తురొచ్చింది. వళ్లంతా గీరుకు పోయింది. అయినా అన్నివిధాలా బలవంతులయిన యిద్దరు ఒక్కణ్ణి చేసి చావ బాదుతున్నారు. కానీ చుట్టూ చేరిన్నవాళ్లు ఏం మాట్లాడటం లేదు. వూరు వూరుకుంది. చుట్టూ చేరిన వాళ్లకి ఏ వక్కరికీ కృష్ణమాచారి నిజా యతీ పట్ల అపనమ్మకం లేదు. కానీ అలా బయ టకు చెప్పే ధైర్యం లేక కొందరు, 'మనకెం దుకు' అని కొందరు వూరుకున్నారు. ఫలితం?..... కామాంధుడూ, వంచకుడూ అయిన ఒక రాక్ష సుడి చేతిలో ఒక అమాయకుడు బలి అయి పోతున్నాడు. పులి కాపువేసి లేడి పిల్ల మెడ నోటితో చిక్కించుకుని పరుగు తీసింది. లేడి పిల్ల గిల గిల కొట్టుకుంటూ అరుస్తోంది. క్షుద్ర జంతువు లన్నీ పులి దారిలోంచి తప్పుకుని తొంగి తొంగి చూస్తున్నాయి. లేడి పిల్ల విషాదంగా అరుస్తోంది. ప్రక్కనే పోతున్న ఏనుగులు తమకేమీ పట్ట నట్లు నడిచిపోతున్నాయి. పులిని ఎదుర్కొనే శక్తి వాటి కుంది. కానీ లేడి పిల్ల కొరకు ఆ పని చెయ్యటం వాటి కంత అవసరం కాదు. లేడిపిల్ల గిలగిల కొట్టుకుని పులి నోట్లో ప్రేలాడిపోయింది.. అది అడవి. యిది వూరు. అయినా పరిస్థితుల్లో ఏం భేదం లేదు. మనస్తత్వాలన్నీ ఒక్కటే. సుబ్బావధానిని ఎదిరించగల అండదండలున్న వాళ్లు న్నారు. కానీ ఒక వూజారి కోసం ఆ పని చెయ్యటం అనవసరం. మానవత్వం మరిగిపోయింది. న్యాయ ధర్మం ఆవిరయినై. నీతినియమాలు ఎగిరిపోయినై రాక్షసత్వం నగ్నంగా నర్తిస్తోంది. యిదీ ప్రపంచం యిదేం ప్రపంచం?! యిదే ప్రపంచం!!

గాయత్రి పరుగుపరుగున వచ్చి కృష్ణమా చారి మీద వ్రాలింది. సుబ్బావధాని ఆమెను జుట్టు పట్టుకుని దూరంగా లాగాడు. కృష్ణమా చారి తల నేలకేసి బలంగా కొట్టాడు రామిరెడ్డి. తల చిట్లి ముఖం మీదకు రక్తం కారింది. రక్తం కంటి మీద నుంచి కారుతుంటే జుట్టు పట్టుకుని గాయత్రిని అవతలకు లాగుతున్న సుబ్బావ ధానిని చూశాడు కృష్ణమాచారి. అతడిలో కొన్ని వేల అగ్ని పర్వతాలు ప్రబద్దలయినయ్. అవి ఎన్న టికీ చల్లారవ్. ఒక మంచివాడి హృదయం అందులో మాడిపోయింది....... వరదమ్మగారు, లక్ష్మీదేవిగారు రావటంతో ఆ పైశాచికం అంత టితో ఆగింది. పెద్ద మనుష్యులందరూ యిళ్లకు వెడుతూ 'డబ్బు గడ్డి తినిపిస్తుంది' అన్నారు. గడ్డితిని డబ్బు గడించిన పెద్ద మనుష్యులు.!

కృష్ణమాచారి ఎవరితోనూ మాట్లాడ లేదు. గాయత్రిని ఆధారంగా చేసుకుని 'మఠా'నికి వెళ్లాడు. ముఖమంతా వాచింది. ఒళ్లంతా రక్తపు మరకలు. వేడి నీళ్లతో గాయత్రి తుడుస్తూ వుంటే శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. కన్నీళ్లు ధారలు కట్టినయి.....

సాయంత్రం గుడికి వెళ్లి దీపారాధన చేశాడు. ఒళ్లంతా నెప్పులుగా వుంది. విగ్రహం వంకచూస్తూ కూర్చున్నాడు. విగ్రహం నవ్వింది. దేవుడు నవ్వు తున్నాడు....గాయత్రి కూడా ప్రక్కనే వుంది. కృష్ణమాచారి మధ్యాహ్నం నుంచి యింతవరకూ ఒక్క మాట కూడా మాట్లాడ లేదు. గాయత్రికి భయంగా వుంది. దేవుడికి నమస్కారం చేసి,

'గాయత్రీ పోదాం పద.... యీ వూరి నుంచి వెళ్లిపోదాం' అంటూ లేచాడు కృష్ణమాచారి.

మర్నాడు ప్రొద్దున 'మఠం'లో గాయత్రీ, కృష్ణమాచారి కన్పించలేదు. లక్ష్మీదేవిగారు ఏడుస్తూ సుబ్బావధాని వాళ్లిద్దరికూ చేసిన అన్యాయం వూళ్లో అందరకూ చెప్పింది. ఆ వుదయమే గర్భ గుడిపై భాగం విరిగి విగ్రహం మీద పడింది. విగ్రహం విరిగి పోయింది.... తర్వాత పునఃప్రతిష్ఠ చేయించాలని లక్ష్మీదేవిగారు ప్రయత్నించింది. కాని ప్రయత్నాలు ఫలించ కుండానే ఆవిడ కన్ను మూసింది..... కృష్ణమాచారికి యీ అవమానం జరిగిన ఆరు నెలలలోపలే పుష్ప మనిషి పుష్పట్లు రక్తం కక్కుకుని చనిపోయాడు సుబ్బావధాని.

దేవాలయంలో దేవుడుంటాడో లేదో తెలి యదు. కానీ ఒక మంచి మనిషి మనస్సు దేవా లయం కంటె పవిత్రమైంది. అందులో కోట్ల కొలది దేవుళ్లుంటారు. మంచి మనిషి మనస్సుని బాధ పెడితే ఆ పాపం వూరికే పోదు. ఆ బాధలో కోటి శాపాలుంటాయి. ఇది నిజం. ఇదే నిజం.

* * *

వర్షం తగ్గింది. యిద్దరం గుడి మండపం మీద నుంచి లేచాం.